రైల్వే వంతెనపై రోడ్డు వేయాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోచారం: యంనంపేట్‌లోని రైల్వే వంతెన పై గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలను మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి దృష్టికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వంతెనపై రోడ్డు వేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. మున్సిపాలిటీ తరఫున ఆర్‌అండ్‌బీ కమిషనర్‌కు లేఖ రాస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ ప్రవీణ్, నాయకులు శ్రీనివాస్, రాజు, సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

మేడ్చల్: పట్టణంలోని వివిధ వార్డులలో మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. అత్వెల్లి 2వ వార్డు, కిష్టాపూర్ 4వ వార్డు, మేడ్చల్ 8వ వార్డులలో దాదాపు 60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్లు సరితమల్లేష్‌గౌడ్, తుడుం గణేష్, చాపరాజులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో కమిషనర్ నాగిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లకు నో స్టాప్..

- ఘట్‌కేసర్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- దశాబ్దకాలంగా కోరుతున్న ప్రయాణికులు
- నిర్లక్ష్యంలో పాలకులు, యంత్రాంగం
- రైలు కూత ఎప్పుడంటూ.. ప్రయాణికుల ఎదురుచూపులు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం దశాబ్దకాలంగా కోరుతున్న పాలకులు, యంత్రాంగం స్పందించడం లేదు. రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేశారు కాని.. ఏ ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలును ఆపడం లేదు. ఏళ్ల తరబడి కోరుతున్న ప్రయాణికుల మొర ఎవరికి చెవికెక్కడం లేదు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా, మంత్రి పదవులు వచ్చినా ప్రయాణికుల వెతలు తీరడం లేదు. దక్షిణ మధ్య రైల్వే కేంద్రం సికింద్రాబాద్ నుంచి ఉత్తర, దక్షిణ భారతదేశం వెళ్లే 100 ప్రధాన రైళ్లు ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ నుంచి వెళ్తుంటాయి. అన్నీ సదుపాయాలు ఉన్నా ప్రయాణికుల సమస్యలకు మోక్షం లభించడం లేదు.

ఆగేవి కొన్నే..

ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం వరంగల్–సికింద్రాబాద్ పుష్‌పుల్, సికింద్రాబాద్–భద్రాచలం రోడ్డు కాకతీయ, సికింద్రాబాద్–రేపల్లే, ఘట్‌కేసర్–లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయడానికి అన్ని హంగులు ఉన్నప్పటికీ ఆపడం లేదు. ఘట్‌కేసర్ మీదుగా నిత్యం పరిగెడుతున్న వందలాది రైళ్లను చూడడం తప్ప ఇదే స్టేషన్‌లో ఎక్కేందుకు అవకాశం లభించడం లేదు.

ఆపాల్సిన రైళ్లు ఇవే..

కృష్ణా ఎక్స్‌ప్రెస్, తెలంగాణ, సిర్పూర్–కాగజ్‌నగర్, నారాయణాద్రి, గోల్కొండ, పద్మావతి, శబరి, ఇంటర్‌సిటీ, గౌతమి, కాకినాడ, విజయవాడ, గుంటూరు వెళ్లే రైళ్లను ఆపాలని కోరుతున్నాం. మండలంలో 20కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు, ఎంబీఏ, వైద్య, వ్యవసాయ కళాశాల, ఇన్ఫోసిస్, రోహెజా, జెన్‌ప్యాక్ లాంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ఉన్నాయి. జాతీయ రహదారి ఉండడం, 24 గంటల పాటు రవాణ సౌకర్యం కలిగి ఉన్నందున సరిహద్దు జిల్లాలు, ఏపీతో పాటు ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. కానీ దూర ప్రాంతాలకు వెళ్లడానికి రైళ్ల సౌకర్యం లేకపోవడంతో అవస్తలు పడుతున్నారు. కళ్ల ముందు రైళ్లు పరిగెడుతున్నా.. 30 కిలోమీటర్ల దూరం ఉన్న సికింద్రాబాద్‌కు వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికుల సమయం, డబ్బు వృథా కావడమే కాకుండా ట్రాఫిక్‌తో సమయానికి చేరుకోలేకపోతున్నారు. పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

రవాణా సౌకర్యం పెంచాలి..



ఘట్‌కేసర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా రైలు రవాణా సౌకర్యం పెంచాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. ఇప్పటికైన స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి.

– గోపి, ఎన్‌ఎఫ్‌సీనగర్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

ప్రయాణికులు నష్టపోతున్నారు..



దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సికింద్రాబాద్ వెళ్లవలసి వస్తుంది. డబ్బు, సమయం వృథాతో పాటు ట్రాఫిక్ సమస్య అదనంగా వచ్చి పడడంతో సమయానికి చేరుకోలేకపోతున్నాం. స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే ప్రయాణికులకు మేలు జరుగుతుంది.

– సుధాకర్‌రెడ్డి, బొక్కొనిగూడ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

తుది ఓటరు జాబితా ప్రదర్శన



శామీర్‌పేట్: రానున్న పంచాయతీ ఎన్నికల కోసం తుది ఓటరు జాబితాను బీఎల్‌ఓలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మండలంలో 7 పంచాయతీల తుది ఓటరు జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మమతబాయి మంగళవారం ప్రచురించారు. మండలంలోని పంచాయతీల వార్డుల వారిగా జాబితాను నాయకులు చూసుకోవాలని సూచించారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



మేడ్చల్‌రూరల్: అర్హులైన నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు అందించాలని బీజేపీ కౌన్సిలర్ హంసరాణి కోరారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామంలో గృహజ్యోతి పథకంలో భాగంగా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వద్దకు మంగళవారం అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కౌన్సిలర్ దరఖాస్తుల పరిశీలనలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం అధికారులు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


మహా పడిపూజలో మహేందర్‌రెడ్డి, మాజీ మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కావ్య, కార్పొరేటర్ శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకుల వినతి

మేడ్చల్ : రాష్ట్రంలో రైతులపై కేసులు పెట్టి పోలీసురాజ్యం నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు క్షమాపన చెప్పాలని మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై కేసులు పెట్టడం, రైతులకు సంకెళ్లు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ చేపట్టిన నిరసనలలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి అంబేడ్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు రాజమల్లారెడ్డి, భాస్కర్‌యాదవ్, విష్ణుచారి, సందీప్‌గౌడ్, నవీన్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ ఇళ్ల సర్వే పరిశీలన


ఇళ్ల సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ మమతబాయి

శామీర్‌పేట్: పేదలకు ఇంటి వసతి కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుర్కపల్లిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మమత బాయి, కార్యదర్శి విజయ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. సర్వే ఆధారంగా ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న లక్ష్మారెడ్డి, ఆంజనేయులుగౌడ్

ఘట్‌కేసర్: రైల్వే వంతెనను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 17వ రోజుకు చేరుకుంది. దీక్షలకు మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్ రావు, ఐటీ ఉద్యోగి సతీష్‌నాయక్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నగేష్‌గుప్తా, యాదగిరి, ఖలీల్, ఫరూక్, కమలాకర్, విజయ్ పాల్గొన్నారు.

సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: సమస్యలు లేని మున్సిపాలిటీగా నాగారం మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో సుమారు 12.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి


గురుకుల పాఠశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

కీసర: గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మేడ్చల్ నియోజవకర్గం బీజేపీ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కీసరలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో ఎలుకలు కొరికిన విద్యార్థులను పరామర్శించేందుకు స్థానిక బీజేపీ నేతలతో కలిసి గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. కాగా అనుమతి లేదని పోలీసులు బీజేపీ నేతలను పాఠశాలలోకి అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి అక్కడే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవని, పాఠశాలల్లోకి పాములు, ఎలుకలు వస్తున్నాయని వాటి వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం, అధికారులు స్పందించి గురుకుల పాఠశాలల్లో వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని.. లేకుంటే విద్యార్థుల తరుపున పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు. బీజేపీ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఐసీటీలో ఉద్యోగాలు

మేడ్చల్: ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ తార్నాకలో టెక్నిషన్ పోస్టులు ఉన్నాయని అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమానాయక్ కోరారు. ఐఐసీటీ పోస్టులకు కనీస అర్హత ఐటీఐ కావడంతో ఐటీఐ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు, డిసెంబర్ 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఐటీఐ అప్రెంటిస్ సెక్షన్ 9963729969 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

కీసర: దమ్మాయిగూడ ప్రధాన రహదారి విస్తరణను 100 అడుగుల నుంచి 80 అడుగులకు కుదించాలని కోరుతూ మంగళవారం ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రసుత్తం ఉన్న రహదారిని 100 అడుగుల రహదారిగా విస్తరించేందుకు అధికారులు నిర్ణయించి, ప్రధాన రహదారిలో ఉన్న ఇంటి యజమానులకు నోటీసులు అందజేశారని, రహదారిని 100 అడుగులకు విస్తరిస్తే తాము నష్టపోవాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా 80 అడుగుల వరకు రహదారి విస్తరణను కుదించాలని విన్నవించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు కమిషనర్ నాగమణి తెలియజేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

జోడిమెట్లలో నాలా పరిశీలన


నాలా మ్యాప్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: జోడిమెట్లలోని నాలాను ఇరిగేషన్ అధికారులతో కలిసి పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నాలాకు హద్దులను గుర్తించి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం నాలా మ్యాపును చూసి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేశ్, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ కల్లు విక్రయాలపై చర్యలు తీసుకోండి

మల్కాజిగిరి: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కల్లు విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన నిర్వాహకులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఇందిరానెహ్రూనగర్‌లో వారి దుకాణం వద్ద కాకుండా మీర్జాలగూడ ప్రాంతంలో వేరొకరు విక్రయిస్తున్నారని, గతంలో కూడా ఫిర్యాదు చేశామని, పట్టించుకోలేదన్నారు. సొసైటీలో సుమారు 110 మంది సభ్యులున్నారని, అక్రమ విక్రేతల కారణంగా నష్టపోతున్నామన్నారు. లైసెన్స్ ఉన్న ప్రాంతంలో కాకుండా వేరే చోట విక్రయిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లోని పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ షెడ్డును నిర్మించి అద్దెలకు ఇచ్చుకున్నారని ఆరోపిస్తూ ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి హెచ్‌ఎండీఏ, ఉప్పల్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన వారు డీసీ ఆంజనేయులుతో కలిసి షెడ్డును సీజ్ చేశారు. అనంతరం హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా.. 2–3 రోజుల్లో తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ స్థలంలో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని డీసీ స్పష్టం చేశారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వినతి


అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకి వినతిపత్రం అందచేస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేయర్ శాంతి మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాని కలిసి వినతిపత్రం అందచేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఫైరింగ్ కట్ట వరకు 100 ఫీట్ల రోడ్డు నిర్మించాలని, జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను పెంచాలని, జీహెచ్‌ఎంసీ పెండింగ్ నిధులు విడుదల చేయాలని ఆమె వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘మజిల్ మేనియా’ ఫైనలిస్టును అభినందించిన ఎమ్మెల్యే


శంకర్‌సింగ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ లోని ఎక్స్‌ట్రీమ్ జిమ్ కోచ్ శంకర్‌సింగ్ ‘మజిల్ మేనియా ఆసియా’ ఫైనల్ పోటీలకు అర్హత సాధించడంతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయనను అభినందించారు. పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు, మైనారిటీ నాయకులతో కలిసి శంకర్ సింగ్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇంటికి వెళ్లగా ఎమ్మెల్యే ముందు తన విద్యను ప్రదర్శించాడు. ఎమ్మెల్యే ఆయనను అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు మహబూబ్‌అలీ, నాయకులు పృథ్వీరాజ్‌రెడ్డి, ఖాజా మెయినుద్దీన్ తదితరులు ఉన్నారు.

సురక్షిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలి


మాట్లాడుతున్న సీ.ఐ. వెంకటయ్య తదితరులు

కీసర: బాల్య వివాహాలు, గంజాయి, బాలకార్మికులు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలు సురక్షిత గ్రామాలని కీసర సీ.ఐ వెంకటయ్య అన్నారు. మంగళవారం యాద్గార్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మై ఛాయిస్ ఫౌండేషన్ సహకారంతో గో ఇండియా ట్రస్టు సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం గృహహింస, బాల్య వివాహాలు, మానవ అక్రమరవాణా, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్, గంజాయి ఇతర అలవాట్లకు బానిసలవ్వడం వల్ల పోక్సో కేసులు నమోదవుతున్నాయన్నారు. వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఎస్.ఐ వెంకటేష్, సంస్థ ప్రతినిధులు వివిఎస్ రీనా, క్రాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17 బూత్‌లకు బీజేపీ నూతన బూత్ అధ్యక్షులను నియమించింది. జిల్లా ఎన్నికల అధికారి మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు తమ బూత్‌లలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు శ్రీధర్, విక్రమ్, నవీన్, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నూతన బూత్ అధ్యక్షులతో నాయకులు

ఏడో రోజుకు చేరిన నిరసన దీక్షలు



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. వినూత్నంగా చేపడుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు చాయ్ కప్పులతో నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలకు టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు తిరుమలేష్, తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా నాయకుడు లక్ష్మయ్య, తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డా. వేణు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ఫణి, దేదిప్య, ఇంద్ర, క్రిష్ణ, సుధారాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.